చెయ్యం" అని అన్నాడు. ఇతని మాట పూర్తి కాకముందే వియ్యంకుడు జానకిరామయ్య కయ్యాన్ని పూర్తిచేసే ఉద్దేశ్యమేమీ లేనట్లుగా "అవునోయ్. అయితే ఇప్పుడు పోనీ. పెండ్లి అయిన తర్వాతనే వీడికి (కొడుకుని వేలుపెట్టి చూపిస్తూ) మూడునాలుగు వేలయింది. మేం మాత్రం ఎందాకా అని చచ్చేది" అన్నాడు పూర్వపు ప్రళయ ధ్వనితోనే. కాని పరంధామయ్య యథాపూర్వకం గానే,

"సరే. నీ కొడుక్కు నువ్వు బి. ఏ. చదివించుకుంటే నీకు తరిగిందేముంది వీళ్లల్లో బాగా లాభిస్తూంది. నీకొక లెఖ్ఖా? మేమంటే చితికిపోయాం కాబట్టి నీవెన్నన్నా పడవలసి వచ్చింది" అని అన్నాడు.

జానకిరామయ్య మళ్ళీ లేచి నుంచుని సారాంశం తేల్చిచెప్పే ఉద్దేశ్యంతో "సరే. మేం అనావద్దు. మీరుపడావద్దు ఎందుకు మనకుగొడవ. కట్నం పూర్తిగా ఇస్తారా సరేసరి. లేదూ, నాకొడుక్కి రేపీపాటికి రెండో పెండ్లి ఎదుకు కాదో చూస్తాను. మీరిచ్చిన రెండు వేలూ కూడా మీముఖానే కొడతానులే" అని కొడుకు వంక చూసి "లేరా. పోదాం. అర్థరాత్రవుతూంది" అని కొడుకు రెక్క పట్టుకొని రుసరుస లాడుతూ తలుపు దభాలన తీసి గబగబా వీధిలోకి పోయి గృహోన్ముఖులయ్యారు.

కాని ఈ మాటలవల్ల స్తంభించి పోయింది ఒక్కరూ ఇద్దరూ కాదు. తండ్రి, కొడుకు, గడపలోనుంచి వింటూన్న తల్లీ కూతురు, అంతా ఒక్కసారి చందనపు బొమ్మలయిపోయారు. ఎవరికీ నోట మాట పెగలేదు. అందరి కండ్లలోనూ అశ్రువులు మాత్రం నిండి ఉన్నాయి. కొడుకు మాత్రం ఇంకా కోపంతో వెళ్ళిపోయిన వారి దిక్కు కేసి చూస్తూ చేతులు కట్టుకుని నిలబడి పోయాడు.

దానికే వనజ ఇంత రాత్రివేళ అరుగుమీద కూర్చుని కుపితురాలౌతూ, రెప్పవాల్చనికండ్లతో భారంగా చంద్రునివంక చూస్తూ ఉంది. తన మామ పోతూ పోతూ అన్న మాటలే ఖాయమైతే తన బ్రతుకేం కావాలో ఆమె లేత మనస్సుకు కొంతవరకు అర్థమవటం చేత, ఆందుమూలమైన భారాన్ని బలవంతంగా హృదయంలోంచి తోసిపారవేయ సాధ్యం కాకుండా ఉంది. అలా ఎంతవరకు ఒంటరిగా కూర్చుని ఉందో ఆమెకే తెలియదు.

---

కథానిక

# పిదపకాలం

పండితారాధ్యుల పరంధామయ్య

గొట్లపల్లికి కరటయ్య కిరీటంలేని రాజు. అనేక దశాబ్దాలనుండి కరటయ్య వంశం గొట్లపల్లిపై విశేషాధికారాలను చెలాయించింది. ఈ మధ్య ఆంధ్రలోని సంచలనం గొట్లపల్లిని కూడా కాస్త వూపింది. కాని కరటయ్య చర్చిల్ మాదిరి గర్జించాడు. తన బొందిలో ప్రాణముండగా తన ఆధిక్యతను గొట్లపల్లి ప్రజలు గుర్తించక తప్పదని. గమనించవలసిన విశేషమేమిటంటే కరటయ్య గర్జించేటప్పుడు అతని చేతిలో అప్పుడే కాల్చబడిన జానెడు పొడుగు చుట్ట వున్నదట. ఇంతలో ఎలెక్షన్సు రావటం-కరటయ్య యింటికి ఫిఫ్టీవన్ మోడల్ కార్లు దినం నాగా లేకుండా రావడం-పోవడం- ఆ వూళ్లో పిల్లలకు పండుగగా వుండేది. కరటయ్య కూడా తానొకమెట్టు పైకి ఎక్కినట్టే భావించాడు. ఎప్పుడూ ముఖం చూపని ఆ ఘరానాదారు తన్ను కార్లలో ఎక్కించుకొని తిప్పటం, ఎంతో దీనంగా తన్ను వాడటం వీటితో కరటయ్య వుబ్బి తబ్బిబ్బయిపోయ్యాడు. తన గ్రామంలోని వోట్లన్నీ సాలిడ్ అని చెప్పి— అయినా సందేహంతోచి-తన ఆశ్రితుడు, విధేయుడునైన తిప్పయ్యను గ్రామ పరిస్థితిని గురించి అడుగుదామనుకొన్నాడు. కాని కార్లలో తిరిగే హడావిడిలో నాలుగు రోజులు దాకా వీలు చిక్కిందికాదు. అయిదవనాడు నిద్ర లేవటంతోటే తిప్పయ్య జ్ఞప్తికివచ్చి అతని కోసం మనిషిని పంపాడు. తిప్పయ్య నిమిషాల్లో రానే వచ్చాడు.

"రావయ్యా, రా. ఏం బొత్తిగా కనబడటం లేదే?"

"నీళ్ళర్ధట్లుగా వుండే, వంటిరిగాణ్ణయితిని. ఆ తాటిబొంగుల చేనికి నాలుగు రోజులనుంచి గూడేస్తుంటే దాని తస్సాదియ్యా నాలుగు మూలలా తడిస్తేగదూ."

"నీతో ఒక విషయం చెప్పాలని మొన్నటి నుండి వుద్దేశం. కాని ఏం చేస్తాం. క్షణం తీరిక లేదు. వాడొచ్చి అటు లాక్కుపోతే ఈడొచ్చిటు లాక్కుపోతే."

"నేనూ చూస్తూ వుండాగా ఈ నెలరోజుల నుండి. మీరింటి పట్టున ఎక్కడుండారు. కారుల్లోనే మకాం యేస్తిరే" అంటూ నవ్వబోయి దగ్గాడు.

"లేనిపోని యశలుగా వుంది తిప్పయ్యా. అయినా ఏం చేస్తాం చెప్పు? అందరూ కావలసినోళ్ళు."

"అలాగని అందరిని పట్టుకొని వేలాడుతుండారా? ఏదో తమ విషయం వాళ్ళకి బాగా తెలిసింది కాబట్టి."

"ఆ అదే తిప్పయ్యా! అందుకనే యీళ్లిట్లా నన్ను వేధించటం. ఇంతకీ వాళ్ళకి మాట ఖరారిచ్చేను. వూళ్ళో మాత్రం మన మాటకు మిగిలిపోతారా అని."

"ఆఁ మన మాటకు తిరుగేముంది కాని,"

"కాని... ఏదో వుందే బేసందు, లేకుంటే సందేహ మెందుకో."

"అబ్బే, బేసందుంటదనా. వాడుల్లాబోడయ్యా. ఆ పాపరునాయాలు ఏదో వాగుతుండాడట."

"బోడయ్యా? ఆ సన్యాసి మాటలు వినేదెవరు. అయినా వాడేం అటుండాడేం?"

"కాంగిరేసోళ్ళొచ్చినాట నుండి కరువులొచ్చినయంట. పస్తులు మాడాల సొచ్చిందట. పేదోళ్ళకడుపు కొలుస్తున్నారట. ఇంకేం చెప్తాడు వాడి బొంద."

"ఆ. అంతవరకూ వచ్చిందీ? అసలీళ్ళకు కాంగిరేసు సంగతెందుకు మరో దాని సంగతెందుకు? ఆ అధనప్రసంగమే వద్దంటూ. ఏం కావలసొచ్చినా గరటయ్య గరటయ్య అంటారా మరొకరిని అనుకుంటారా? అసలీళ్ళకు పార్టీల ప్రసంగమెందుకు?"

"మేమంతా అదే చెప్పేది. మల్లి రెడ్డిగాని కొసుల దామోదరయ్యగాని వాడికి గంటకొట్టినట్టు చెపుతుండారు, మనకెందుకురా ఏపార్టీ యెట్లుంటె మనఖామందులవారి యిష్టం ఎటుంటదో అట్టే మనంకూడా వుందామని"

"అదుగో, అది, రొంవంత బుద్ధి గ్యానంవుండే మనిషి కనిపెట్టాల్సింది అది."

"ఏదో పెద్దోళ్ళ హయాం నుండి ఖామందులోరి సొత్తు దింటుండాం. గొడ్డు తిరగాలన్నా కట్టిపుల్లలు ఏరుకున్నా వారి చలవేకనా? ఎందుకురా యీ మిడిసిపాటు అని తలోమాట అంటుండారు లెండి."

"అయినా యీ సమయంలో మాత్రం యెప్పుడూ అద మరచి వుండకూడదు. ఎందుకయినా మంచిది కొంచెం పోబిళ్లు కనిపెడుతుండు"

"ఆ ఖామందులు గారికి మించిపోద్దా!"

"పొలాన పనుంటె మన మనిషిని పంపుతాగాని ఎప్పటికప్పుడు యవారం కనిబెడుతుండు చూస్తుంటే బెడ తిరిగేట్టుంది."

"తమరు యింతగా చెప్పాలా? అయినా మీ మాటకు...."

"అట్లనబోకులే తిప్పయ్యా! కాలం చూస్తే మహా వొడుదుడుకులుగావుంది మరీ యీ పిల్లగాడ్దెల దెబ్బకు తట్టుకొనేట్టు లేదు."

"మీరు శానావూళ్లు తిరిగేరు కావోల్ను యెట్టుందక్కడ యవారం."

"మనకే హాపుగా వుందిలే."

ఎలెక్షను ఆయ్యేలోపల గరటయ్య తిప్పయ్య యెన్నోసార్లు కలుసుకున్నారు. అయితే పని తొందరలవల్ల ఇంత సావకాశంగా వారు మాట్లాడుకునే అవకాశం లేకపోయింది. ఎలెక్షను అయిన మర్నాడే గరటయ్య వేరే ప్రాంతానికి కాన్వాసుకుపోయి కొంటింగు నాటికి తిరిగివచ్చాడు. మరునాడు తిప్పయ్య రావటంతోటే గరటయ్య తన దగ్గరకు రమ్మన్నట్టు చేయి వూపాడు. తిప్పయ్య దగ్గరకు పోగానే కూర్చోమన్నాడు. తిప్పయ్య కూర్చుంటూ తన యజమాని వైపు దీనంగా చూశాడు.

"పచ్చిమోసం తిప్పయ్యా! ఇంత దగా జరు

గుద్దని కలలోనన్నా అనుకున్నామా? ఏది ఆటోఇటో అంతా మనకేనని వాళ్ళకి జెప్పేసుంటి, వాళ్ళ దుంపతెగ ఏపెట్టికా పెట్టి తినేస్తిరి. తీరా జూస్తినిగా, అంతా మనకే ననుకున్నది పాతిక గూడా లేకపోయె. నలుగురిలో తల గోట్టేసినట్టయిందంటే నమ్ము."

"అందులో మీకు చిన్నతనమని వేరే చెప్పాలా?"

"ఆ, పరే-యిక చచ్చేందుకు. వోట్లప్పుడు మనం అనకపోతిమే మరింక నసువెందుకు. మన ఆవరణంలో పశువు మెదలడం కాని. కట్టె పుల్ల గొట్టడంగాని-ఏమంటావ్?"

"అబ్బే! అందులో వెనక తొక్కేది కూడానా? నరమానవుణ్ణి మెదలనిస్తానా అని?"

"అదుగో అదే. ఏమాత్రం పసువు చేరం కూడదు. సమయానికి లేంది యీాళ్లలో ఎందుకంట మనకీ ములాజా—"

"అంతే అదే నేను కూడా మీతో అనాలని—"

"నేజెప్పింది రైటంటావు కదూ?"

"ఓ. మీరు చెప్పే దాంట్లో బేసబు కూడానా."

"సరే యికేం. నాకు పనుంది వొక ప్రయాణం తగిలింది. నే వచ్చేప్పటికి వారం రోజులవుతుంది. నేజెప్పింది మనసున బట్టింది కదూ?"

"ఓ అంత మాత్రం మీరు చెప్పాలనేగాని, రేపీయాళ్ళకి ఎక్కడుచ్చులు అక్కడ బిగిసి పోవూ?"

వారం రోజుల తర్వాత గరటయ్యా అప్పుడే పట్నం నుండి తిరిగొచ్చాడు చొక్కాదీసి వొంకెకు తగిల్చి చుట్ట ముట్టించి వరండాలో కుర్చీలో కూర్చున్నాడు, అతని ముఖ వైఖరిని చూసి పిల్లలు దూరంగా తొలగి పోయ్యారు. ఇంట్లో సందడి కూడా అణిగింది. నౌకర్లు అతని కంటపడకుండా శ్రమపని తాము చేసుకుంటున్నారు. ఇంతలో వొక ముసలోడు చిన్న బుట్టతో సహా గరటయ్యా ఎదుటి కొచ్చి నిలబడ్డాడు.

"ఏంరా వచ్చావ్?" గరటయ్యా మండిపోతూ అడిగాడు.

"ఏంలేదు దొరా! మా కోడలు పరిగేరుకోటానికి పోయింది. మాలాలు గూడాను. పరిగేరి ఇంటికొస్తుంటే ఖామందులగారి పాలేరు మెడబెట్టి దోశాడు దొరా! కాలవలో పడింది. కంకులు తుంచిందంటాడు ఆ మారాజు. ఇవి కంకులో-ఏరుకొన్న రెళ్లలో-దరమ ప్రభువులు చూచి చెప్పండి. నలుగురం పోయి దాన్ని చేతుల మీద యేసుకొచ్చాం. పమాదంగా వుండది."

"ఆ. దానికోసం ఫిర్యాదు చేయొచ్చావా? పో గాడ్దెకొడుకా. పో, ముందు నా వాకిలి దిగు. వూ, పోతావా పోవా?"

"అదేంటి దొరా. నాయపభువులు."

"మేము న్యాయప్రభువులము, మీరు సత్య హరిశ్చంద్రులూ. పో, ముందు నా వాకిలి దిగు. నీకే చెప్పేది, పోవూ" చెప్పు చేతికి తీసుకుంటాడు లేస్తూ.

"ఇదేనా నాయం... చెప్పుకోవస్తే."

"ఆ ఏమిటిరా కూస్తావ్," చెప్పు తీసుక బాదతాడు. ముసలోడు కొట్టొద్దు బాబో అని కేకలేస్తాడు. గరటయ్యా అలుపొచ్చిందాకా కొట్టి—"వొరే- వెంటూ! యీ గాడ్దెకొడుకుని వీధిలోకి నెట్టు" అంటూ వీరావేశంతో లోపలికెళ్ళాడు.

ఆనాటి సాయంత్రం గరటయ్యా వరండాలో కూర్చొని చుట్ట తాగుతూ వుంటాడు. తిప్పయ్యా పరుగెత్తుకుంటూ వచ్చి "పెమాదం పెమాదం. ఖామందులు లోపలికెళ్ళండి."

"ఏం తిప్పయ్యా, ఏమొచ్చింది."

"మాలపాలెమంతా వచ్చేస్తుంది. మీరు ముందు లోపలికెళ్ళండి, తరువాత చెప్తా."

ఇంతలో దూరాన అరుపులు, కేకలు వినవచ్చాయి. గరటయ్యా లోపలికి పొయ్యాడు. తలుపు గడియవేశాడు. అరగంటలో గరటయ్య యింటిముందుకు మాలపాలెమంతా వచ్చేసింది. కేకలు. యీలలు - గలభా...ఒక గంటసేపు ఆ వుద్రిక్త ప్రజాసమూహం గరటయ్య యింటిముందు విచ్చలవిడిగా విహరించి యిళ్ళకు తిరుగుముఖం పెట్టింది. తన హయాంలోనే యీలాంటి సంఘటన జరగటం నిజంగా గరటయ్యకు తల తీసేసినట్టే అయింది.